# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్లలో 5 రూపాయలకే అల్పాహారం, భోజనం అందిస్తామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ❖ నీట్-యూజీ 2024 పునః పరీక్షను ఒక నిర్దిష్ట ప్రాతిపధికన మాత్రమే ఆదేశించగలమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.
- ❖ శాంతి భద్రతలు, ఆర్థిక శాఖ, ఎక్సైజ్ శాఖలపై మరో 3 శ్వేతపత్రాలను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.
- ❖ అల్పపీడనం ప్రభావంతో కోస్తాంధ్రలో రాబోయే మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్లలో 5 రూపాయలకే అల్పాహారం, భోజనం అందిస్తామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలోని సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. అన్ని అన్న క్యాంటీన్లు ఒకే రీతిలో ఉంటాయని, ఆగస్టు 10వ తేదీ నాటికి చాలా చోట్ల పనులు పూర్తవుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా వ్యాప్తి చెందుతోందని, పిడుగురాళ్లలో నీరు కలుషితమవడం వల్ల వందమందికి డయేరియా సోకిందని తెలిపారు. పైపులు మరమ్మతులు చేయవం వల్లే కొన్ని ఇబ్బందులు వచ్చాయని మురికి కాల్వల నిర్వహణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 42 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

నీట్-యూజీ 2024 ప్రశ్నాపత్రాల లీక్, పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈరోజు మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)కు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

విద్యార్థులు సాధించిన మార్కులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. విద్యార్థుల గుర్తింపును గోప్యంగా ఉంచాలని.. పరీక్షా కేంద్రం, నగరాల వారీగా ఫలితాలను వెల్లడించాలని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్షలపై దాఖలైన పిటిషన్లపై సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా విస్తృత స్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని గుర్తిస్తేనే పునః పరీక్షకు ఆదేశించగలమని స్పష్టం చేసింది. పిటిషనర్లకు వచ్చిన కనీస మార్కులపై సమాచారం ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వ హయాంలో వివిధ విభాగాలకు సంబంధించిన పురోగతిపై ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాలను విడుదల చేస్తూ వస్తోంది. ఇప్పటికే సహజ వనరులు, విద్యుత్, పోలవరం-నీటిపారుదల రంగం, రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలు విడుదల చేశారు. శాంతి భద్రతలు, ఆర్థికశాఖ, ఎక్సైజ్ శాఖలపై మరో 3 శ్వేత పత్రాలను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో  విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22 నుండి ప్రారంభం  కానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే  ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సామాన్య ప్రజల జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులు రక్షణ కల్పించాలని, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా సంయమనం పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని మహిళా, శిశు సంక్షేమ, విద్యా, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీని నియమించి, విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

అల్పపీడనం ప్రభావంతో కోస్తాంధ్రలో రాబోయే మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగిలిన చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. ఈ రోజు మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో మోహరించివున్న INS శివాలిక్ యుద్ధనౌక వేదికగా విశిష్ట సందర్శకుల దినోత్సవం నిర్వహించామని తూర్పునావికాదళ అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేసాయి. ఈ సందర్భంగా ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ ఛీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ నౌకను అధిరోహించి సిబ్బందితో సమావేశమయ్యారు. "మోస్ట్ స్పిరిటెడ్ షిప్ ఆఫ్ ది ఈస్టర్న్ ఫ్లీట్" అనే బిరుదును సంయుక్తంగా ప్రధానం చేసినందుకు ఆయన నౌకను అభినందించారు. నౌక ప్రస్తుతం RIMPAC-2024 సముద్ర దశలో పాల్గొంటోంది. ఇందులో పాల్గొనే అనేక దేశాల నౌకాదళాలలో మన జాతీయ జెండా సగర్వంగా ప్రాతినిధ్యం వహిస్తోందని నేవీ అధికార వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

పేద ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ధరల నియంత్రణలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా పెరవలిలో బియ్యం, కందిపప్పు పేద ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణ లేకుండా వినియోగదారులపై భారం మోపారని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీల్లో ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్ లో ఉన్న ధర కంటే 20 రూపాయలు తగ్గించి కందిపప్పును, 10 రూపాయలు తగ్గించి బియ్యాన్ని రైతు బజార్లు ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసువచ్చామని మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు జిల్లా మంగళగిరి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కార్యాలయంలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇతర సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ... వంద రోజులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించికోవడం జరిగిందనీ, బాలలు కోసం పనిచేస్తున్న ముఖ్యమైన ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. కాగా రేపు పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసలి అప్పారావు పర్యటించి కలెక్టర్ కార్యాలయంలో జరిగే మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నీటి నిర్వహణ పనులలో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధికారులను హెచ్చరించారు. ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంచినీటి ట్యాంకు, పంపింగు హౌస్, పవర్ హౌస్, జనరేటర్లు, వాటర్ టెస్టింగు లాబ్, పాత పంపు హౌస్ లను మున్సిపల్ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలువ నీరు ముందు చెరువుకి పంపి ఫిల్టరు చేసి పంపింగు చేయాలని, ఆ తర్వాత మంచి నీటిని పరీక్ష చేసిన తరువాత ప్రజలకు అందించాలని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండల సమీపంలో గండి పోచమ్మ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. అమ్మవారి విగ్రహాన్ని గోదావరి నీరు తాకింది. భక్తుల క్యూ లైన్లు, బయట దుకాణ సముదాయాలు నీటిలో మునిగి ఉన్నాయి. దీంతో ఆలయ అధికారులు దర్శనాలు నిలిపివేశారు. పాపికొండల విహార యాత్రకు వెళ్లే లాంచీలను తాత్కాలికంగా నిలిపివేశారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతపు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =